క్లుప్తంగా

ఘనంగా తూముల పుట్టినరోజు



తూముల భాస్కరరావుకు శుభాకాంక్షలు చెబుతున్న నాయకులు, కార్యకర్తలు

బొబ్బిలి: లోకబంధు విద్యాసంస్థల అధినేత, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు తూముల భాస్కర రావు పుట్టిన రోజు వేడుకలను పట్టణంలోని ఆయన స్వగృహంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు చోడిగంజి రమేష్ నాయుడు, మున్సిపల్ కౌన్సిలర్లు, కారుణ్య ఫౌండేషన్ చైర్మన్ జేసీ రాజు, ఇతర ప్రాంతాలకు చెందిన ప్రముఖులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ముగిసిన అఖండ నామసంకీర్తన



భక్తిగీతాలు ఆలపిస్తున్న భక్తులు

రాజాం సిటీ: భగవాన్ సత్యసాయి జయంతి వేడుకల్లో భాగంగా స్థానిక బాబానగర్‌లోని శివమందిరంలో గురువారం అఖండ నామసంకీర్తన ప్రారంభించారు. ఆదివారంతో వంద గంటల నామసంకీర్తన ముగిసింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రముఖుల పేర వైద్య సేవలు అభినందనీయం



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న సీఐ సతీష్ కుమార్

బొబ్బిలి: ప్రముఖులను స్మరిస్తూ వారి పేరిట పేదలకు వైద్య సేవలందించడం అభినందనీయమని బొబ్బిలి సీఐ కె.సతీష్ కుమార్ అన్నారు. పద్మభూషణ్, మహాకవి గుర్రం జాషువా జయంతి సందర్భంగా పట్టణంలోని ఐటీఐ కాలనీలో అంబేడ్కర్ సాహిత్య పీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు సోరు సాంబయ్య ఆధ్వర్యంలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో మహారాజా ఆస్పత్రి వైద్య సిబ్బంది సేవలందించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేయడంతో పాటు శస్త్ర చికిత్సలు అవసరమైన వారికి మిమ్స్‌లో చికిత్సలు నిర్వహిస్తామని వైద్యులు తెలిపారు. సాహితీ పీఠం ప్రధాన కార్యదర్శి బొద్దాన అప్పారావు, మహారాణి పేట వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయ ధర్మకర్త గెంబలి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దేశమ్మ తల్లి వారాల పండగ



అమ్మవారి ఆలయం వద్ద ముర్రాటలతో భక్తులు

రేగిడి: మండల పరిధిలోని వన్నలి గ్రామంలో ఆదివారం దేశమ్మ తల్లి వారాల పండగ ఘనంగా నిర్వహించారు. గ్రామస్థులంతా ఘటాలు, ముర్రాటలతో ఊరేగింపుగా ఆలయానికి వెళ్లి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. పాడి, పంటలు బాగుండాలని అమ్మవారిని వేడుకున్నారు.

భగత్ సింగ్ జయంతి



భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న లైబ్రేరియన్ కృష్ణమూర్తి, సంగమేశ్వరరావు

తెర్లాం: స్థానిక శాఖా గ్రంథాలయంలో స్వాతంత్ర్య సమరయోధుడు భగత్‌సింగ్ జయంతిని లైబ్రేరియన్ సీహెచ్.కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నెమలాం హైస్కూల్ హెచ్‌ఎం దాకోజు వెంకట సంగమేశ్వరరావు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

- అసలే గుంతల బాధలు మొర్రో అంటే..
- వాటికి తోడు గుమ్ములు,గొయ్యిలు తవ్వారు
- మొన్నటి వరకూ అడుగుకో గొయ్యి.. గజానికో గుంత
- ఇప్పుడు వీధి వీధికీ గుమ్ములే
- బొబ్బిలి వాసులకు నరక యాతన



బలిజిపేట రోడ్డులో..

రహదారులా.. నరకానికి దారులా..?

బొబ్బిలి: పట్టణం, చుట్టూ ఉన్న రహదారులు గుంతలతో నిండిపోయాయి. వాటిని కప్పడమో లేక కొత్త రోడ్లు వేయడమో చేయండి మొర్రో అని ప్రజాప్రతినిధులకు ఏడాది కాలంగా మొత్తుకుంటున్న జనానికి చిన్నచిన్న గుంతలేం ఖర్మ, ఇప్పుడు పెద్దపెద్ద గుమ్ములు కూడా ఇచ్చాం చూడండన్నట్టుంది బొబ్బిలి వాసుల పరిస్థితి!. రాజు గారని మొరపెట్టుకుంటే మరిరెండు తన్నమన్నాడట వెనకటికి ఒకడు. అలా తయారైంది బొబ్బిలి నియోజకవర్గ ప్రజల పరిస్థితి. నియోజకవర్గంలో దాదాపు 42 కిలోమీటర్ల మేర రోడ్లు పాడై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ప్రత్యక్షంగా, సోషల్ మీడియా ద్వారా ప్రజలంతా సమస్య తీర్చండని వేడుకుంటున్న సమయంలో మున్సిపాలిటీలోని వార్డుల్లో గుమ్ములు తవ్వేసి వదిలేశారు. ఈ గుమ్ముల్లో కొన్ని తాగునీటి కుళాయిల మరమ్మతుల కోసం తవ్వగా, మిగతావన్నీ ప్రైవేటు నెట్ కేబుల్ కంపెనీలవి. ఈ గుమ్ములు తవ్వేందుకు ఆర్‌అండ్‌బీ,మున్సిపల్ శాఖలు అనుమతులు ఇచ్చేయడంతో వారు పూర్తిగా మార్కింగ్ ఇచ్చేసి తవ్వించేశారు. ఒకటి తవ్వాక మరమ్మతులు పూర్తి చేసి మరొకటి తవ్వి పనులు ప్రారంభించాలి. కానీ ఏకంగా అన్ని రోడ్ల లోనూ మరమ్మతుల కోసం గుమ్ములు తవ్వేసి వదిలేస్తున్నారు. దీని వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాండ్ర పాపారాయ జంక్షన్, బజారు సెంటర్, చర్చి సెంటర్, బలిజిపేట రోడ్డు, రాయగడ రోడ్డు, కాలేజ్ రోడ్డు, రావు వారి వీధి, ఇలా ఎక్కడ చూసినా లోతుగా గొయ్యిలు తవ్వి వదిలేశారు. అన్ని చోట్ల గుంతలు తవ్వేసి నిదానంగా మరమ్మతుల పనులు చేస్తున్నారు. దీంతో స్థానికులు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చే సందర్శకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



బొబ్బిలి చర్చి సెంటర్‌వద్ద తవ్విన గొయ్యి



బజారు సెంటర్‌లో ..



చినబజారులోని రామమందిరం వద్ద..



తాండ్రపాపారాయ జంక్షన్‌లో..

అసలే దసరా సెలవులు..ఆపై వర్షాలు

దసరా సెలవుల సందర్భంగా నర్సరీ, ప్రీస్కూల్ పిల్లలు, ప్రాథమిక పాఠశాలల విద్యార్థులు వీధుల్లో ఆడుతూ పాడుతూ తిరుగుతున్నారు. మరో పక్క వాహనాలతో పలు వర్గాలకు చెందిన వ్యక్తులు నిత్యం పట్టణంలో తిరుగాడుతునే ఉంటారు. ప్రైవేటు కేబుల్ వర్కర్లు, నెట్‌వర్క్ కంపెనీలవారు, మున్సిపాలిటీ అధికారులు తవ్వించిన ఈ పెద్ద పెద్ద గుమ్ముల్లో ఎవరైనా ప్రమాదవశాత్తూ పడితే పరిస్థితి ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. కొత్త, పాత రహదారి అనే తేడా లేకుండా ఏకంగా గుమ్ములు తవ్వేసి వదిలేశారు. కొంత మంది వాహనాలతో పడిపోయిన సందర్భాలున్నాయని స్థానికులు మండిపడుతున్నారు. దసరా సందర్భంగా ప్రతీ వీధిలోనూ మంటపాలు ఏర్పాటు చేయడం ,వాటిని సందర్శించేందుకు పలువురు అన్ని వీధుల్లో కలియతిరుగుతున్న నేపథ్యంలో గుమ్ములు ప్రమాదకరంగా పరిణమించాయి. శరన్నవరాత్రి ఉత్సవాల ముగిసిన సందర్భంగా అన్ని వీధుల్లో ఉన్న విగ్రహాలకు అనుపోత్సవం నిర్వహిస్తారు. ఆసమయంలో భక్త జనం అధికంగా సంచరిస్తారు. మరో పక్క పండగ సందర్భంగా పట్టణ వాసులే కాకుండా ఇతర ప్రాంతాల వారు కూడా షాపింగ్, ఇతర అవసరాలకు తిరుగాడుతునే ఉంటారు. ఇలాంటి సమయంలో ఈ గుమ్ములు నరకానికి దారుల్లా ఉన్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇన్ని గుమ్ములు తవ్వాలని అనుమతులు ఇచ్చిందెవరని ప్రశ్నిస్తున్నారు. పాలక వర్గం, అధికారులు ఏం చేస్తున్నారని మండిపడుతున్నారు. వెంటనే గుమ్ములు కప్పే ఏర్పాటు చేయాలని ఇందుకు తగిన ఆదేశాలివ్వాలని కోరుతున్నారు.

ఏఈలకు సూచనలిస్తాం



పట్టణంలో రెండు చోట్ల మాత్రమే కుళాయిల కోసం తవ్వించాం.త్వరలోనే వాటిని పూడ్చి వేస్తాం . మిగతావి కేబుల్ పనుల తవ్వకాల కోసం తవ్వినవి. ఒకేసారి అన్నీ తవ్వినట్టు తెలియదు. ఇక నుంచీ ఒక దాని తర్వాత మరొకటి తవ్వేలా చర్యలు తీసుకుంటాం. ఏఈలకు సూచనలిస్తాం.

– ఎల్ రామలక్ష్మి, మున్సిపల్ కమిషనర్,బొబ్బిలి

బాలకృష్ణ వ్యాఖ్యలు దుర్మార్గం

- విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే శంబంగి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

రామభద్రపురం: మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి, సినీనటుడు, మెగాస్టార్ చిరంజీవిపై శాసన సభలో హిందూపురం ఎమ్మెల్యే, సినీనటుడు నందమూరి బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలు దుర్మార్గమని బొబ్బిలి మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావుతో కలిసి ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా శంబంగి మాట్లాడుతూ 2004లో హైదరాబాద్‌లో బాలకృష్ణ తన ఇంటిలో రివాల్వర్‌తో జరిపిన కాల్పులకు సంబంధించిన కేసులో దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి కాపాడకుంటే ఆయన అప్పుడే జైలుకు వెళ్లాల్సి వచ్చేదని ఘాటుగా విమర్శించారు. తనని జైలుకెళ్లకుండా వైఎస్.రాజశేఖరరెడ్డి రక్షిస్తే ఇప్పుడు ఆయన కుమారుడు జగన్‌పై బాలకృష్ణ కనీసం ఇంగిత జ్ఞానం లేకుండా అగౌరవంగా మాట్లాడటం సరికదాన్నారు. దేశంలోనే అత్యంత ప్రజాదరణ పొందిన జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించే హోదా,స్థాయి బాలకృష్ణకు లేదన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు చిత్ర పరిశ్రమకు సంబంధించిన సమస్యలపై చర్చలు జరపడానికి చిరంజీవితో పాటు పలువురు సినీప్రముఖులు వచ్చారని, ఆ చర్చల అంశాన్ని అసెంబ్లీలో అసందర్భంగా బాలకృష్ణ ప్రస్తావించి చిరంజీవిని వాడు,వీడు అంటూ చేసిన వ్యాఖ్యలు హేయమైనవని అన్నారు. కరుడు గట్టిన కులతత్వం,అధికార మదంతో చిరంజీవిపై బాలకృష్ణ ఇంత దారుణంగా మాట్లాడినా చిరంజీవి తమ్ముడైన డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఖండించకపోవడం, కనీసం జనసైనికులు దీనిపై మాట్లాడకపోవడం విస్మయానికి గురిచేస్తోందన్నారు. పవిత్రమైన అసెంబ్లీని టీడీపీ తమ ఆఫీస్‌గా మార్చుకుని ఇతరులపై ఇష్టం వచ్చినట్లు పరుషపద జాలాన్ని వాడుతూ తిట్టడానికి, కించపరచడానికి వాడుకుంటున్నారని మండిపడ్డారు. అహంకారంతో బాలకృష్ణ తన తండ్రి ఎన్.టి.రామారావుకు చెడ్డపేరు తీసుకొస్తున్నారని విమర్శించారు. బొబ్బిలి మున్సిపాలిటీ మాజీ చైర్మన్ ఎస్.వి.మురళీ కృష్ణారావు, వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు డర్రు పైడిరాజు, సీనియర్ నాయకులు చింతల సింహాచలంనాయుడు, కనిమెరక అప్పారావు, పాలసొసైటీ అధ్యక్షుడు చొక్కాపు రామకృష్ణ,మాజీ ఎంపీటీసీ బప్పడాల చిన్నంనాయుడు పాల్గొన్నారు.

దసరాకు ఊరెళ్తున్నారా.. ఇల్లు జాగ్రత్త



మాట్లాడుతున్న సీఐ నారాయణరావు

రామభద్రపురం: దసరా సెలవులకు ఇళ్లకు తాళాలు వేసి సొంత ఊళ్లకు వెళ్లే వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సీఐ కె నారాయణరావు సూచించారు.స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ వి.ప్రసాదరావుతో కలిసి ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పండగకు తాళాలు వేసి ఉన్న ఇళ్లనే దొంగలు లక్ష్యంగా చేసుకుంటారని, ఇంట్లో విలువైన వస్తువులు,నగలు,నగదు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తిరిగి ఎప్పుడు వస్తారనే విషయాలను స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇస్తే రాత్రి సమయాల్లో పోలీసులు ఆయా ఇళ్లపై నిఘా మరింత పెంచే అవకాశముంటుందన్నారు.ఇళ్ల మీద సీసీ కెమెరాలు ఉండడం ఉత్తమమం అన్నారు.మీరు ప్రయాణంలో ఉన్న విషయాన్ని సోషల్ మీడియాలో ఫొటోలు ,వీడియోల ద్వారా షేర్ చేయడం దొంగలకు సంకేతంగా మారుతుందన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు సిరిపురం క్రీడాకారులు



రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్‌కు ఎంపికైన క్రీడాకారులు

సంతకవిటి: మండలంలోని సిరిపురం గ్రామానికి చెందిన ఆరుగురు క్రీడాకారులు రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 14న శ్రీకాకుళం లోని కోడి రామ్మూర్తి స్టేడియంలో జరిగిన జిల్లాస్థాయి జూనియర్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచడంతో రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించి, ఏలూరులో ఈనెల29న జరగనున్న పోటీలకు వెళ్లారు. క్రీడాకారులు ఆర్.స్వాతి అండర్–16 విభాగంలో 600 మీటర్ల రన్నింగ్‌కు, ఎస్.సునీత అండర్–18 విభాగంలో 2 కిలోమీటర్ల రన్నింగ్‌కు, జి.మేఘన అండర్–18లో హార్డిల్స్ రన్నింగ్‌కు, ఎం.బాలాంజలి అండర్–18లో 100మీటర్ల రన్నింగ్‌కు, బి.వి.లక్ష్మి, అండర్–20 విభాగంలో 3 కిలోమీటర్ల రన్నింగ్, డిస్కస్ త్రోకు, వి.రాజశేఖర్ అండర్–20లో 400మీటర్ల రన్నింగ్‌కు, జావెలిన్‌త్రోకు ఎంపికయ్యారు. వీళ్లంతా సిరిపురం హైస్కూల్ పూర్వ విద్యార్థులు.

డిఫెన్స్ వెటరన్ కార్డులివ్వాలి



మాజీ సైనికుల సంఘ సర్వసభ్య సమావేశం

బొబ్బిలి: మాజీ సైనికులకు డిఫెన్స్ వెటరన్ కార్డులివ్వాలని ఆ సంఘం గౌరవాధ్యక్షుడు మరడ రామినాయుడు కోరారు. స్థానిక మాజీ సైనికుల సంఘ కార్యాలయంలో సంఘ అధ్యక్షుడు రేవళ్ల కిరణ్‌కుమార్ అధ్యక్షతన ఆదివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో పలువురు మాజీ సైనికులు సమస్యలను వివరించారు. ఎస్.పాపారావు తదితర మాజీ సైనికులు మాట్లాడుతూ మాజీ సైనికులకు పెన్షన్ అందుతుందన్న కారణంగా ఎటువంటి సంక్షేమ పథకాలూ ఇవ్వడం లేదన్నారు. ప్రభుత్వ ఉద్యోగులను,మాజీ సైనికులను ఒకేలా చూడడం సరికాదన్నారు. మాజీ సైనికులకు డిఫెన్స్ వెటరన్ కార్డులిచ్చి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింప చేయాలని కోరారు. ఈ విషయమై సైనిక సంక్షేమ కార్యాలయం ద్వారా ప్రభుత్వానికి ప్రతిపాదించేందుకు తీర్మానం చేశారు. ఈ అంశంపై సైనిక సంక్షేమ అధికారితో మాట్లాడుదామని గౌరవాధ్యక్షుడు రామినాయుడు సంఘ సభ్యులకు సమాధానమిచ్చారు. సమావేశంలో సంఘ సంయుక్త కార్యదర్శి ఏ.గోవిందనాయుడు, కోశాధికారి వి.ఎస్.శర్మ, తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉండేందుకే డిజిటల్ బుక్



డిజిటల్ బుక్ క్యూ ఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్, తలే రాజేష్, తదితరులు

రాజాం సిటీ: వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు అండగా ఉండేందుకు వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డిజి టల్ బుక్‌ను ఆవిష్కరించారని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ తలే రాజేష్ అన్నారు. ఆదివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న రోజుల్లో ప్రతీ కార్యకర్తకు అండగా నిలవాలన్నదే వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఉద్దేశమని ర్కొన్నారు. అన్యాయానికి గురైన ప్రతి ఒక్కరూ క్యూఆర్ కోడ్ ద్వారా డిజిటల్ బుక్‌లో నమోదుచేసుకునేందుకు వీలుగా అవకాశం కల్పించారని చెప్పారు. అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్న అధికారులు, నాయకులపై భవిష్యత్‌లో చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అటువంటి వారు ఎక్కడున్నా ప్రజాకోర్టులో నిలబెట్టి తగిన గుణపాఠం చెబుతామని అన్నారు. అంతా సమష్టికృషితో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, మరోసారి జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకునేందుకు సైనికుల్లా పనిచేయాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శ్రీకాకుళం జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్‌మోహనరావు, రాజాం టౌన్, రూరల్, వంగర, రేగిడి మండలాల పార్టీ కన్వీనర్లు పాలవలస శ్రీనివాసరావు, లావేటి రాజగోపాలనాయుడు, కరణం సుదర్శనరావు, వావిలపల్లి జగన్‌మోహనరావు, జెడ్పీటీసీ బండి నర్సింహులు, వంగర ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ, వైస్ ఎంపీపీలు నక్క వర్షిణి, టంకాల పాపినాయుడు, యాలాల వెంకటేష్, పాలవలస దవళేశ్వరరావు, వాకముళ్ల చిన్నంనాయుడు, వంజరాపు విజయ్‌కుమార్, పార్టీ పెన్షనర్ల సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు పాలవలస శ్యామసుందరరావు, జిల్లా కల్చరల్ విభాగం అధ్యక్షుడు డాక్టర్ బి.నరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ మహమ్మారిపై పోరు



నేత్రవైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ కల్యాణచక్రవర్తి, తదితరులు

రాజాం సిటీ: కిశోర బాలికలు, మహిళల్లో గర్భస్థ క్యాన్సర్ నివారణకు రోటరీ అంతర్జాతీయ సంస్థ ప్రణాళికలు రూపొందించిందని రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్, కొటేరియన్ డాక్టర్ వై.కల్యాణచక్రవర్తి తెలిపారు. రాజాంలో ఆదివారం రోటరీ క్లబ్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో పోలియో నిర్మూలనలో రోటరీ సంస్థ ప్రముఖ పాత్ర వహించిందని అన్నారు. క్లబ్ సభ్యుల సహకారం, భాగస్వామ్యంతో దీర్ఘకాలిక ప్రణాళికల ద్వారా సమాజంలోని అర్హులైన వారి అభ్యున్నతికి కృషిచేయాలని సూచించారు. గుండెపోటు సమయంలో తక్షణ కర్తవ్యంగా ప్రతీ ఒక్కరు సీపీఆర్‌లో శిక్షణ పొందేటట్టు రోటరీ క్లబ్ చొరవ చూపి యువకులు, విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలని కోరారు. రోటరీక్లబ్‌లో మెంబర్‌షిప్ పెంచడంతోపాటు దిశానిర్దేశం చేయాలని అన్నారు. అంతకు ముందు బొబ్బిలి రోడ్డులోని డివైడర్‌లో మొక్కలు నాటారు. అనంతరం విద్యానికేతన్‌లో రోటరీ ఆధ్వర్యంలో జరుగుతున్న నేత్రవైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ శిబిరంలో 13 మందిని శస్త్రచికిత్సలకోసం పుష్పగిరి కంటి ఆస్పత్రికి తరలించామని రొటేరియన్, ఆప్తాలమిక్ అధికారి ఎస్.వసంత రావు తెలిపారు. రోటరీక్లబ్ రాజాం అధ్యక్షుడు గట్టి పాపారావు, కార్యదర్శి సప్పటి వసంతరావు, ఆకిరి రామారావు, కొల్లా కృష్ణారావు, శాసపు సత్యనారాయణ, మక్క అప్పలనాయుడు, సురేష్, అల్లాడ జనార్దనరావు, కొత్తా మధుసూదనరావు, బి.వి. అచ్యుత్‌కుమార్, డాక్టర్ పృథ్వీ, ఎస్.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

తెలుగుసాహిత్యంలో కుమార సంభవం తొలి ప్రబంధం



మాట్లాడుతున్న రంగనాథం

రాజాం సిటీ: తెలుగు సాహిత్యంలో కుమార సంభవం తొలి ప్రబంధమని ప్రముఖ విమర్శకులు గార రంగనాథం అన్నారు. ఆదివారం స్థానిక విద్యానికేతన్ పాఠశాలలో రాజాం రచయితల వేదిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 'నన్నెచోడుని నన్నెచోడుడు' అనే అంశంపై ఆయన మాట్లాడారు. సతీదేవి జననం, వినాయకుడి పుట్టుక, దక్షయజ్ఞధ్వంసం, పార్వతి తపస్సు, కుమారస్వామి జననం, అతడు తారకాసురుని చంపడం అనే కథ కుమార సంభవంలో ఉందని చెప్పారు . 2010 గద్యపద్యాలతో 12 అశ్వాసాల ప్రబంధాన్ని కుమారసంభవంగా నన్నె చోడుడు రచించాడని వివరించారు. ఇలా శైవ మతానికి చెందిన కథలను రాయడం వల్లే శివకవియుగంలోని మొదటి కవిగా ఇతనిని పేర్కొంటారని తెలిపారు. నన్నెచోడుడు టెంకణాదిత్యుడు, కవిరాజశిఖామణి అనే బిరుదులు కలిగిన రాజకవి అని పేర్కొన్నారు. నేతేటి గణేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సభ్యులు ఒమ్మి రమణమూర్తి, రౌతు గణపతిరావు నాయుడు, పిల్లా తిరుపతిరావు, నేతేటి విజయశైలజ, తురంగి విశ్వనాథం, పొట్నూరు కోటిబాబు, పల్ల నారాయణమూర్తి, మూడడ్ల శ్రీనివాసరావు, అంబల్ల రామమూర్తి, పడాల కవీశ్వరరావు, కుదుమ తిరుమలరావు, పారుపల్లి కిరణ్‌కుమార్, అమనాన నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పార్టీ ఫిరాయించిన వారికి ప్రజలే బుద్ధి చెబుతారు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బాడంగి: ఒకపార్టీ బీఫారంపై పోటీచేసి గెలుపొంది మరో పార్టీలోకి వెళ్లి పోయిన వారికి భవిష్యత్‌లో ప్రజలే బుద్ధి చెబుతారని, ఆరోజులు దగ్గరలోనే ఉన్నాయని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు యామల శివప్రసాద్, ఆపార్టీ నాయకులన్నారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో శివప్రసాద్ మాట్లాడుతూ మండలం లోని గూడెపువలస ఎంపీటీసీ సభ్యుడు పూడి సింహాచలం కూటమి ప్రభుత్వ ప్రలోభాలకు లొంగి పార్టీమారడం రాజకీయ వ్యభిచారమని అన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారం లో ఉన్నప్పుడు పనులు చేయించుకుని లబ్ధిపొంది, ఇప్పుడు అధికారం లేదని పార్టీ ఫిరాయించడం అవకాశవాద రాజకీయం కాక మరేమవుతుందని ప్రశ్నించారు. సొంత ప్రయోజనాల కోసం ప్రజా తీర్పునకు విరుద్ధంగా పార్టీలు మారే వారికి ప్రజలే బుద్ధి చెబుతారని అన్నారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ యువత,విద్యార్థి విభాగాల అధ్యక్షులు బేతనపల్లి శంకరరావు, తెంటు తిరుపతిరావు,రాజశేఖర్,పూడి బాలకృష్ణ పాల్గొన్నారు.





మహాచండీదేవిగా దుర్గమ్మ



బొబ్బిలిరూరల్: కృష్ణాపురంలో మహాచండీదేవిగా దర్శనమిస్తున్న అమ్మవారు

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బొబ్బిలి,రాజాం నియోజకవర్గాల్లోని దుర్గాదేవి ఆలయాలు, మంటపాల్లో అమ్మవారు ఆదివారం మహా చండీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేశారు. పలుగ్రామాల్లో అన్నదానాలు చేయడంతో పాటు మంటపాల వద్ద మహిళలు దీపారాధన చేశారు. రాజాం పట్టణంలోని నారాయణస్కూల్ సమీపంలో ఏర్పాటుచేసిన మంటపంలో లక్ష బిల్వార్చన చేశారు. – సాక్షి నెట్‌వర్క్



తెర్లాం: తెర్లాంలోని దుర్గాదేవి మంటపం వద్ద దీపారాధన చేస్తున్న భక్తులు



రాజాం : రాజాం పట్టణంలో లక్ష బిల్వార్చన చేస్తున్న భక్తులు



సంతకవిటి: సంతకవిటిలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు



రేగిడి : రేగిడిలో అమ్మ వారికి పూజలు చేస్తున్న భక్తులు



వంగర: కోనంగిపాడులో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు



రాజాం: లక్ష్మీపురంలో కలశపూజ చేస్తున్న మహిళలు